క్లుప్తంగా

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- అమల్లోకి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్
- రాజకీయ పార్టీల నేతలకు అధికారుల సూచనలు



తునిలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను రాజకీయ పక్షాలకు వివరిస్తున్న ఈఆర్వో రామలక్ష్మి

తుని రూరల్/ప్రత్తిపాడు: ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిందని, ఎన్నికల నియమావళిని పాటించాలని తుని, ప్రత్తిపాడు ఈఆర్వోలు కేవీ రామలక్ష్మి, ఎ.శ్రీనివాసరావు సూచించారు. తుని, ప్రత్తిపాడు రెవెన్యూ కార్యాలయాల్లో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో వారు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీ, ఎమ్మెల్యే సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీ సామగ్రిని 24 గంటల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఉంటే 48 గంటల్లో, ప్రైవేట్ సంస్థలు, ఆస్తులపై ఉంటే 72 గంటల్లో తొలగించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, సోషల్ మీడియాలో ప్రచారానికి ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో స్వచ్ఛందంగా సేవలందించాలి

ఏలేశ్వరం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) విద్యార్థులు స్వచ్ఛందంగా సేవలు అందించాలని ఎస్సై జి.సతీష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డి.సునీత అధ్యక్షతన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌సీసీ విద్యార్థుల పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఎన్‌సీసీ విద్యార్థులకు వచ్చిందన్నారు. విద్యార్థులు ఎన్నికల విధుల్లో పాల్గొని ఉత్తమ సేవలు అందించాలన్నారు. తమ సేవల ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, సురేష్, వీరభద్రరావు, బంగారాజు, మదీనా తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తుని రూరల్: హంసవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఆ గ్రామ సర్పంచ్ రాయి మేరీ అవినాష్ పరీక్షా కిట్లను పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో హెచ్‌ఎం వి.పద్మజ అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్సిళ్లు, పెన్నులు, హాల్ టికెట్ భద్రపర్చుకునేందుకు పౌచ్‌లు ఆమె అందజేశారు. పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ వి.చిన్నారావు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

శంఖవరం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న పుంత రోడ్డుకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక సగర కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పర్వత వివేక్, ఆచంట వెంకటేశ్వరరావు, పెనుపోతుల శివ, షేక్ నూర్, రైతులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



కోటనందూరులో ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న సీఐ మూర్తి

కోటనందూరు/గోకవరం: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని తుని రూరల్ సీఐ ఎస్వీఎస్‌ఎస్ మూర్తి విజ్ఞప్తి చేశారు. కోటనందూరు, గోకవరం మండలాల్లోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ రాజకీయ పక్షాలు, ప్రజలు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై బి.శంకర్, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రాజా ది గ్రేట్



తుని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి: దాడిశెట్టి రామలింగేశ్వరరావు (రాజా)
తండ్రి పేరు : దాడిశెట్టి శంకరరావు
తల్లిపేరు : సత్యనారాయణమ్మ
భార్య : లక్ష్మీ చైతన్య
కుమారుడు : శంకర్ మల్లిక్
కుమార్తె : ఆశ్రిత
పుట్టిన తేదీ : 19-07-1975
బ్లడ్ గ్రూపు : ఓ పాజిటివ్
విద్యార్హత : డిగ్రీ
ప్రస్తుత హోదా: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి
వృత్తి : గోల్డ్ మర్చంట్, వ్యవసాయం
అభిరుచులు : పుస్తక పఠనం, క్రీడలు, సామాజిక సేవ
కులం : కాపు

రాజకీయ నేపథ్యం
2008లో ప్రజారాజ్యం పార్టీలో జనరల్ సెక్రటరీగా పని చేశారు. తుని నియోజకవర్గం నుంచి టికెట్ కోసం ప్రయత్నించారు. 2010లో వైఎస్సార్ సీపీలో చేరారు. తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ,2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున తుని నుంచి అభ్యర్థిగా పోటీ చేసి యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడిపై విజయం సాధించారు.

సామాజిక సేవా కార్యక్రమాలు
విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు సేవలు అందించారు. కరోనా సమయంలో వేలాది మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు మూడు పూట్ల భోజనం ఉచితంగా ఇస్తున్నారు. కష్టాల్లో ఉన్న పేదలకు ఆర్థిక సహాయం, ఆలయాలకు డోనేషన్ తదితర సేవలు అందించారు.

'వరుపుల'కే వరం



వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి పేరు: వరుపుల సుబ్బారావు
తండ్రి: సూర్యారావు
భార్య : వెంకటలక్ష్మి
కుమారులు: సత్యసూరిబాబు, రాజబాబు
కుమార్తె : రాజ్యలక్ష్మి
వృత్తి: వ్యవసాయం, రాజకీయం
పుట్టిన తేదీ: 21-10-1942
విద్యార్హత: ఎస్‌సీసీ

రాజకీయ నేపథ్యం:
పదేళ్ల పాటు లింగంపర్తి సర్పంచ్‌గా, మరో పదేళ్లు లింగంపర్తి పీఏసీఎస్ అధ్యక్షుడిగా పని చేశారు. 1994 నుంచి 1999 వరకు డీసీసీబీ చైర్మన్‌గా, 2004 నుంచి 2009 వరకు ఎమ్మెల్యేగా, 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా పని చేశారు.

ప్రత్యేకత
ఒకసారి పరిచయమైతే ఎన్ని ఏళ్లయినా పేరు పెట్టి పిలవడం ఈయన ప్రత్యేకత.

'తోట'కే జగ్గంపేట టికెట్



వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పేరు: తోట వెంకట నరసింహం (తోట నరసింహం)
పుట్టిన తేదీ: 02-06-1961
సొంత గ్రామం: కిర్లంపూడి మండలం వీరవరం
ప్రస్తుత హోదా: వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి
విద్యార్హతలు: బీకాం, ఐసీడబ్ల్యూఏ
సతీమణి: తోట వాణి (2019లో పెద్దాపురం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందారు)
సంతానం: కుమారుడు తోట రాంజీ, కుమార్తె ఉన్నారు
రాజకీయ నేపథ్యం: సోదరుడు తోట వెంకటాచలం మరణానంతరం రాజకీయ రంగప్రవేశం చేసిన ఆయన 2004లో కాంగ్రెస్ పార్టీ తరఫున జగ్గంపేట నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా, పీసీసీ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2009లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ మరణానంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో 2010 నుంచి 20014 వరకూ స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా పని చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీలోకి చేరి కాకినాడ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. పార్లమెంట్‌లో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతలు నిర్వహించారు. లోక్‌సభలో బిజినెస్ అడ్వైజరీ కమిటీ, రైల్వేల స్టాండింగ్ వంటి పలు కమిటీలకు సభ్యుడిగా పని చేశారు.

సామాజిక సేవా, అభివృద్ధి కార్యకలాపాలు
2004 నుంచి 2019 వరకూ జగ్గంపేట నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారు. ముఖ్యంగా జగ్గంపేటలో ఫైర్ స్టేషన్, కిర్లంపూడిలో రూ.1.65 కోట్లుతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం, కిర్లంపూడి, జగ్గంపేటలో డిగ్రీ కళాశాలలు మంజూరు. జగ్గంపేటలో ఆర్వో ప్లాంట్ నిర్మాణం. నియోజకవర్గంలో పంట పొలాలకు సాగునీటి వసతి వంటి వాటికి విశేషంగా కృషి చేశారు. పలు ప్రభుత్వ భవనాలు, రహదారులు అభివృద్ధికి పాటుపడ్డారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లను నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చారు. అలాగే సొంత నిధులతో అనేక కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే టికెట్ వరుపుల సుబ్బారావుకు కేటాయించడంపై హర్షం
- గెలుపుపై వరుపుల ధీమా



ఏలేశ్వరంలో సంబరాలు చేస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు, పార్టీ నాయకులు



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రత్తిపాడునియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వరుపుల సుబ్బారావుకు టిక్కెట్ కేటాయించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక బాలాజీ చౌక్ వద్ద బాణసంచా కాల్చి స్వీట్లు పంచి పెట్టారు. శనివారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఫైనల్ జాబితాను ఖరారు చేశారు. వరుపులకు సీటు కేటాయించడంతో గెలుపు ఖాయమని పార్టీశ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంబరాల్లో వరుపుల సుబ్బారావు పాల్గొనడంతో రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి సీటు కేటాయించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి సీఎం జగన్‌కు గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్, దళే కిషోర్, సుంకర రాంబాబు, వాగు బలరామ్, మలకల వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు/అన్నవరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావుకు పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంపై ఆ పార్టీ నాయకులు ప్రత్తిపాడు, అన్నవరంలో శనివారం సంబరాలు చేసుకున్నారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుడాల వెంకటరత్నం, బెహరా దొరబాబు, ఇసుకపాటి సత్తిబాబు తదితరులు స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు.



అన్నవరంలో నేతల సంబరాలు

హ్యాట్రిక్‌పై మంత్రి రాజా గురి

- ముచ్చటగా మూడోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ
- హర్షం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: సార్వత్రిక ఎన్నిక నగరా మోగడంతో వైఎస్సార్ సీపీ తుని ఎమ్మెల్యే అభ్యర్థిగా దాడిశెట్టి రాజాను ముచ్చటగా మూడోసారి అదృష్టం వరించింది. శనివారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఫైనల్ జాబితాను ఖరారు చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలక సేవలు అందించిన దాడిశెట్టి రాజా 2014, 2019 ఎన్నికల్లో యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడుపై విజయం సాధించారు. మూడోసారి తుని నుంచి మళ్లీ రాజా ప్రాతినిధ్యం వహించనున్నారు. తుని మండలం క్యాంపు కార్యాలయంలో రాజాను పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నూరు శాతం అమలు చేశామని, సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి ఓటువేసి ఆశీర్వదించాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల్లో రాజాను అఖండ మోజార్టీతో గెలిపించుకుంటామని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం



తునిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శంకర్ మల్లిక్

తుని: సంక్షేమ పాలనతో ప్రజల మనసును చూరగొన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 28వ వార్డులో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మంత్రి దాడిశెట్టి రాజా నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. ప్రజలకు మంచి చేశామని ధైర్యంగా చెప్పి ఓటు అడుగుతున్నామన్నారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు చెబుతున్న మాయ మాటలను నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో మంత్రి దాడిశెట్టి రాజాను అఖండ మోజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం
- జగ్గంపేట టికెట్ కేటాయించడంపై హర్షాతిరేకాలు



గోకవరంలో స్వీట్లు తినిపించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట నియోజకవర్గం నుంచి తాను భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహం అన్నారు. శనివారం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఫైనల్ జాబితాను ఖరారు చేశారు. జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి తీరుతామని చెప్పారు. అధిష్టానం జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు ప్రకటించిన వెంటనే స్థానిక నేతలతో కలసి ఆయన గ్రామ దేవత రావులమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జగ్గంపేటలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆరోగ్య పరిస్థితి కొంత ఇబ్బందిగా ఉన్నా తనపై నమ్మకంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి టికెట్ ఇవ్వడం ఆనందంగా ఉందని భావోద్వేగానికి లోనయ్యారు. పార్టీ నేతలు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. రావులమ్మగుడి నుంచి వైఎస్సార్ విగ్రహం వరకూ ప్రచారం వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, యువ నేత తోట రాంజీ, నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు, గఫూర్, రావుల గణేష్ రాజా, పెద్దాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ప్రచార రథంపై ఊరేగుతున్న తోట నరసింహం

తోటకు ఎమ్మెల్యే టిక్కెట్ ప్రకటించడంపై హర్షం

గోకవరం: వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తోట నరసింహాన్ని ప్రకటించడంపై ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గోకవరంలో పార్టీ నాయకులు స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. వచ్చే ఎన్నికల్లో తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా గెలిపించి తద్వారా జగన్‌ను మరోసారి సీఎం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, నాయకులు సుంకర వెంకటరమణ, నరాలశెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తాం



ఏలేశ్వరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో శనివారం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలతో పార్క్ ప్రహరీ, రూ.32 లక్షలతో పైపులైన్ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణాభివృద్ధికి అనేక నిధులు కేటాయించిందన్నారు. రాబోయే రోజుల్లో పట్టణంలో అభివృద్ధి పనులను ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శిడగం వెంకటేశ్వరరావు, దళే కిషోర్, మలకల వేణు, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి
- ఎస్.తిమ్మాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



ఎస్.తిమ్మాపురంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న తోట వాణి , తోట శ్రీనిధి

కిర్లంపూడి: సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి అన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురంలో పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ అధ్యక్షతన శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తోట వాణి, ఆమె కోడలు తోట శ్రీనిధి పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మందేటి వీరలక్ష్మి, ఓలేటి రాజు, గండికోట అప్పన్న, జలసూత్రపు వెంకన్న, గంటికోట లోవరాజు, అర్.శ్యామ్, తుమ్మల వీరబాబు, దేవా బత్తుల జానీ, కొప్పుల ప్రేమ్‌బాబు, కంటే శేంఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



వెంకటనగరంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని వెంకటనగరం గ్రామానికి 30 కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సమక్షంలో గ్రామానికి చెందిన ముప్పిడి నూకరాజు, మంగ శ్రీను, రేచుకట్ల రాజామణి, బండి అర్జమ్మ, మట్ల అచ్చమ్మ, లోడ రమణ, కన్నాబత్తుల కుమారి, కొంగి లావణ్య తదితరులు పార్టీలో చేరారు. వీరికి వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

75 శాతం ఓట్ల సాధనే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో సమావేశం



జగ్గంపేటలో నేతలకు మేము సిద్ధం-మా బూత్ సిద్ధం కిట్లు పంపిణీ చేసిన తోట నరసింహం

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో జగ్గంపేట పట్టణ ఓట్లు ఎంతో కీలకమని, ఇక్కడ ఉన్న ఓట్లలో 75 శాతం ఓట్లు సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. స్థానిక సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో శనివారం పట్టణ సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట పంచాయతీలో 20 వేల ఓట్లు ఉన్నాయని, వీటిలో 75 శాతం ఓట్లు ఫ్యాన్ గుర్తుకు పడేలా చూడాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించాలని సూచించారు. సమావేశంలో నాయకులు ఎన్నికలకు మేము సిద్ధం-మా బూత్ సిద్ధం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, నియోజకవర్గ పార్టీ ఎన్నికల సమన్వయ కర్త అత్తులూరి సాయిబాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, గఫూర్, జగాల్,రావుల గణేష్‌రాజా, కాపారపు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 38 కేసుల పరిష్కారం



ప్రత్తిపాడు సబ్ జైలులో వసతులపై ముద్దాయిలను ఆరా తీస్తున్న న్యాయమూర్తి సుధారాణి

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎం.సుధారాణి 38 కేసులను పరిష్కరించారు. ఐదు సివిల్ కేసులను పరిష్కరించి, బాధితులకు రూ.7.50 లక్షలు ఇప్పించారు. బ్యాంకుల ఆర్థిక నేరాలకు సంబంధించి నాలుగు కేసుల్లో రూ. 57 వేలు, ఒక బీఎస్ఎన్ఎల్ కేసులో రూ.600 బ్యాంకు, బీఎస్ఎన్ఎల్‌లకు చెల్లింపజేశారు. మరో 28 క్రిమినల్ కేసులను న్యాయమూర్తి ఎం.సుధారాణి పరిష్కరించారు. లోక్‌అదాలత్ బెంచ్ మెంబర్ బొంగుళూరి మధుబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ పుల్లయ్య, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి
ప్రత్తిపాడు కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎం.సుధారాణి శనివారం సాయంత్రం స్థానిక సబ్ జైలును సందర్శించారు. సబ్ జైలులోని వంట సామగ్రి, వివిధ విభాగాలను ఆమె క్షుణంగా తనిఖీ చేశారు. జైలులోని 12 మంది ముద్దాయిలను విచారించారు. జైలులో వారికి అందుతున్న వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరిటెండెంట్ బాబు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత 'అమరజీవి'



ఏలేశ్వరంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఏలేశ్వరం: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేతలు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలను లెక్కచేయని పొట్టిశ్రీరాములుకు తెలుగు ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వాగు బలరామ్, కోరాడ ప్రసాద్, బోద చిరంజీవిరావు, అంజూరి రాజారావు, రౌతు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాల సరిహద్దులో పోలీస్ చెక్‌పోస్ట్

తుని రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కాకినాడ, అనకాపల్లి జిల్లాల సరిహద్దులో 16వ నంబర్ జాతీయ రహదారిపై తుని రూరల్ పోలీసులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. శనివారం కాకినాడ జిల్లా ఎస్పీ, పెద్దాపురం డీఎస్పీ ఆదేశాల మేరకు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్టు రూరల్ ఎస్సై డి.రమేష్ బాబు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాజకీయ పార్టీలు అక్రమంగా తరలించే నగదు, నగలు, గృహ ఉపయోగ వస్తువులను అరికట్టేందుకు ఈ చెక్‌పోస్ట్‌లో నిరంతరం నిఘా కొనసాగిస్తామన్నారు. 24 గంటలు తమ సిబ్బంది వాహనాలను తనిఖీలు చేస్తారని, అనుమతి, ఆధారాలు లేని వస్తువులు, నగదు స్వాధీనం చేసుకుంటామన్నారు. ఏమైనా వస్తువులు, నగదు, నగలు తరలిస్తే సంబంధిత వ్యక్తులు, వాహనదారుల వద్ద బిల్లులు ఉంచుకోవాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గోకవరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తదితరులు

గోకవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నేత సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ.38 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం వారు శంకుస్థాపనలు చేశారు. గోకవరం ముస్లిం కాలనీలో రూ.6 లక్షలతో రెండు సీసీరోడ్లు, బ్రహ్మల కాలనీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, రూ.8 లక్షలతో ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధికి, రంపయర్రంపాలెం, పెంటపల్లి గ్రామాల్లో రూ.6 లక్షలతో చేతి పంపులు, డ్రైనేజీల నిర్మాణానికి, గుమ్మళ్లదొడ్డిలో రూ.6 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు పార్టీ నాయకులతో కలిసి శ్రీకారం చుట్టారు. అన్నిగ్రామాల్లోనూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎస్ ఆలీషా, నాయకులు సుంకర వెంకటరమణ, నరాలశెట్టి నర్శయ్య, తోలేటి రాంప్రసాద్, టౌన్ కన్వీనర్ వీర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.